ప్రజలపై బాదుడు.. ఢిల్లీని సాదుడు!

ఇదే ఇందిరమ్మ మార్క్ కాంగ్రెస్ పాలన

ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎన్డీఎస్ఏకు పట్టింపులేదా?

- 90 కోట్లతో ఎమ్మెల్సీ ఓట్లు కొన్నామని చిన్నారెడ్డి చెప్పినా ఈడీ ఎందుకు స్పందించడం లేదు?
- బడేభాయ్-చోటేభాయ్ బంధంతోనే మౌనమా?
- ఎల్ఆర్ఎస్ ఫ్రీ అని ఇప్పుడు డిస్కౌంట్ ఆఫర్లేంది?
- కాంగ్రెస్ పాలనలో పోలీసుల అత్యుత్సాహం
- జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి వ్యాఖ్యలతో తేటతెల్లం
- నాన్ కాంగ్రెస్, నాన్ బీజేపీ అభ్యర్థినే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలి : హరీశ్‌రావు పిలుపు

> అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్ ఫ్రీగా చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజల ముక్కుపిండి వసూలు చేసేందుకు సిద్ధమైంది. ఆషాఢం సేల్, దీపావళి బొనాంజా, దంతేరాస్ ఆఫర్ల మాదిరిగా 25 శాతం డిస్కౌంట్ అంటూ పేద, మధ్య తరగతి ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నది. భవిష్యత్తులో వన్‌ప్లస్ వన్ ఆఫర్లు, లక్కీ డ్రాలు పెట్టినా ఆశ్చర్యం లేదు. – హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ కాంగ్రెస్‌ను సాదేందుకే ఎల్ఆర్ఎస్ ముసుగులో ప్రజలను బాదేందుకు గల్లీ కాంగ్రెస్ సిద్ధమైందని, ఎన్నికల్లో ఓట్లకోసం ఫ్రీగా చేస్తామని చెప్పి ఇప్పుడు డిస్కౌంట్ల పేరిట మోసం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఎల్ఆర్ఎస్ వద్దని ఒంటికాలిపై లేచిన కోదండరాం ఎమ్మెల్సీ కాగానే ఎందుకు మౌనం వహిస్తున్నడు? పదవి రాగానే ఆయన నోటికి తాళంపడిందెందుకు? మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలుపుకోసం కాంగ్రెస్ 90 కోట్లు ఖర్చు చేసిందని ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి చెప్పినా ఈడీ, ఐటీ, ఎలక్షన్ కమిషన్ ఎందుకు స్పందించడంలేదు? బడేభాయ్-చోటేభాయ్ బంధంతోనే కేంద్ర దర్యాప్తు సంస్థలు మౌనం వహిస్తున్నాయా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి హరీశ్ మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ పాలన అంటే విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనా? అని నిలదీశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతున్న రాహుల్‌గాంధీ ఈ వ్యవహారంపై స్పందించాలని డిమాండ్ చేశారు.

నిరంకుశత్వానికి చిన్నారెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం

'కాంగ్రెస్ పాలనలో పోలీసులు ఎమ్మెల్యేలకు కాపాలా ఉంటున్నారు..ఇందిరమ్మ రాజ్యం పోలీసు రాజ్యమైంది..అక్రమ కేసులు, నిర్బంధాలు సర్వసాధారణమైపోయాయి.. నా 46 ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి ఆవేదనతో చేసిన వ్యాఖ్యలే కాంగ్రెస్ ప్రజాపాలన పేరిట సాగిస్తున్న నిరంకుశత్వానికి అద్దం పడుతున్నయి' అని హరీశ్ దునుమాడారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులు, అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ మొదటి నుంచీ చెప్తున్న విషయం ఉత్తర తెలంగాణకు చెందిన జీవన్‌రెడ్డి, దక్షిణ తెలంగాణకు చెందిన చిన్నారెడ్డి వ్యాఖ్యలతో తేటతెల్లమైందన్నారు.

స్టేట్స్‌మన్లు కాదు..సేల్స్‌మన్లు

ఎల్ఆర్ఎస్ ఫ్రీగా చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజల ముక్కుపిండి వసూలు చేసేందుకు సిద్ధమైందని ఆగ్రహంవ్యక్తం చేశారు. నాడు ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టిన భట్టి విక్రమార్క, సీతక్క, ఉత్తమ్ ఇప్పుడు ఎల్ఆర్ఎస్ వసూళ్ల కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. సీఎం, మంత్రులు స్టేట్స్‌మన్ల తరహాలో కాకుండా సేల్స్‌మన్ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని చురకలంటించారు. ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించవద్దని కోరారు. తెలంగాణ చరిత్రలో రేవంత్‌రెడ్డి డిస్కౌంట్ ముఖ్యమంత్రిగా మిగిలిపోతారని ఎద్దేవాచేశారు.

ఎస్ఎల్‌బీసీ ఘటనకు సర్కారే కారణం

ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారే కారణమని హరీశ్ విమర్శించారు. సొరంగంలో చికుకున్న ఎనిమిది మంది కార్మికులకు చెందిన కుటుంబాల ఆవేదన చూస్తే గుండె తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. 'తప్పు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నది. అందుకే ముఖ్యమంత్రి, మంత్రులు తప్పుడు కూతలు కూస్తున్నారు. ఎనిమిది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుంటే మంత్రులు చోద్యం చూస్తున్నరు. నాడు తెలంగాణను ఎండబెట్టేందుకే సమైక్య పాలకులు సాధ్యంకాని ప్రాజెక్టును నెత్తిన రుద్దింద్రు. ఈ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బట్టబయలు చేసింద్రు. అయినా అప్పటి ప్రతిపక్ష నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో ప్రాజెక్టును కొనసాగించింద్రు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసు. కాంగ్రెస్ 2004 నుంచి 2014 వరకు రూ.3600 కోట్లు ఖర్చుపెడితే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 3900 కోట్లు ఖర్చు చేసింది. 11.48 కిలోమీటర్ల టన్నెల్ తవ్వడంతో పాటు శ్రీశైలం లెఫ్ట్ కెనాల్‌పై డిండి, పెండ్లిపాక ప్రాజెక్టులను సైతం పూర్తిచేసింది. కానీ బీఆర్ఎస్ పనులు చేయకపోవడంతోనేనని మంత్రులు ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి పచ్చి అబద్ధాలు చెప్తున్నరు. నాడు నాతో పాటు టన్నెల్ పనులను చూసేందుకు వచ్చిన జూపల్లి కృష్ణారావు కూడా ఇప్పుడు బీఆర్ఎస్ పాలనలో పనులు సాగలేదని చెప్పడం దుర్మార్గం. దురదృష్టకర ఘటనపై బీఆర్ఎస్ రాజకీయం చేయదలుచుకోలేదు. రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందులు ఎదురవుతాయనే ఘటనాస్థలానికి వెళ్లలేదు. కానీ కాంగ్రెస్ మంత్రులు ఇష్టారీతిన బీఆర్ఎస్‌పై బురదజల్లు తుండడంతో వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు స్పందించక తప్పడం లేదు' అని వివరించారు.

14 నెలల్లో కుప్పకూలిన 4 ప్రాజెక్టులు

కాంగ్రెస్ 14 నెలల పాలనలోనే 4 ప్రాజెక్టులు కుప్పకూలాయని హరీశ్ విమర్శించారు. 'ఖమ్మంలో పెద్దవాగు కొట్టుకుపోయింది.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోని వట్టెం పంప్‌హౌస్ నీట మునిగింది.. హైదరాబాద్‌కు తాగునీరందించే సుంకిశాల కుంగిపోయింది. ఇప్పుడు ఏకంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలింది' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో ఒక్క పిల్లర్ కుంగితేనే నాడు నానాయాగీ చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

ఎన్‌డీఎస్ఏ ఎందుకు రావడంలేదు?

గతంలో మేడిగడ్డ పిల్లర్ కుంగితే ఆఘమేఘాలపై స్పందించిన ఎన్‌డీఎస్ఏ ఇప్పుడు ఎస్ఎల్‌బీసీపై ఎందుకు స్పందించడంలేదని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదని హరీశ్ ప్రశ్నించారు. ఐదు రోజులైనా రాష్ట్రానికి రాకపోవడంలోని ఆంతర్యమేమిటని నిలదీశారు. రేవంత్‌ను కాపాడేందుకే కిషన్‌రెడ్డి చీకట్లో ఒప్పందం చేసుకున్నారని, మంత్రులు కూడా ప్రకృతి విపత్తు అంటూ సాకులు చెప్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

నాన్ కాంగ్రెస్.. నాన్ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, టీచర్లు ఆలోచించి ఓటేయాలని హరీశ్ కోరారు. వానకాలం రైతుబంధు, మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వచ్చినవారే కాంగ్రెస్‌కు ఓటేయాలని సూచించారు. లేదంటే ఈ ఎన్నికల్లో నాన్ కాంగ్రెస్, నాన్ బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వాలని విజ్ఞప్తిచేశారు. బీఆర్ఎస్ వ్యూహాత్మకంగానే ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నదని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా ఓడినా ఒరిగేదేం ఉండదని సీఎం రేవంత్ ఎన్నికల సభల్లో చెప్పడం విడ్డూరంగా ఉన్నది. అంటే గ్రాడ్యుయేట్లు, మేధావులైన టీచర్ల ఓట్లు తమకు వద్దని పరోక్షంగా చెప్పి అవమానించారు' అని హరీశ్ ఆక్షేపించారు. ఓడిపోతామనే విషయం ముఖ్యమంత్రికి కూడా అర్థమైందని, అందుకే మొన్న నిజామాబాద్ సభలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడినా ఫరక్ పడేదేమీ ఉండదని చెప్పి ఓటమిని అంగీకరించారని చెప్పారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు పెద్దమొత్తంలో నిధులిచ్చి తెలంగాణకు తెడ్డు చూపిన బీజేపీ అభ్యర్థిని ఓడించాలని గ్రాడ్యుయేట్లు, టీచర్లకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

> ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారే కారణం. సమైక్య పాలకులు తెలంగాణను ఎండబెట్టేందుకే సాధ్యంకాని ప్రాజెక్టును మన నెత్తిన రుద్దింద్రు. ఇదే విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ బట్టబయలు చేసింద్రు. అయినా అప్పటి ప్రతిపక్ష నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో ప్రాజెక్టును కొనసాగించినం. 11.48 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వి శ్రీశైలం లెఫ్ట్ కెనాల్‌పై డిండి, పెండ్లిపాక ప్రాజెక్టులను సైతం పూర్తిచేసినం. ఇప్పుడు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి పచ్చి అబద్ధాలు చెప్తున్నరు. – హరీశ్‌రావు

రేపు ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్తాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కలి సి గురువారం ఎస్ఎల్‌బీసీ ఘటనా స్థలానికి వెళ్తామని హరీశ్ చెప్పారు. ఈ విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మానవత్వంలేదని మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని, ఆయన సూచన మేరకు సమస్య పరిష్కారానికి సలహాలు కూడా ఇస్తామని చెప్పారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లే బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవద్దని కోరారు.

బీఆర్ఎస్ తట్టిలేపితేనే సర్కారుకు సోయి

కృష్ణా జలాల వినియోగంపై ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తున్నదని హరీశ్ మండిపడ్డారు. కేఆర్ఎంబీ ఫస్ట్ మీటింగ్‌లోనే కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పారని విమర్శించారు. తనతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఎత్తిచూపగానే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి బనకచర్లకు అనుమతులు సాధించేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారని, కానీ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే 640 టీఎంసీల నీళ్లు తరలించుకుపోయినా చీమకుట్టినట్టయినాలేదని మండిపడ్డారు. శ్రీశైలం ప్రాజెక్టుపై ఏపీ పోలీసులు, నాగార్జునసాగర్‌పై కేంద్ర బలగాలకు అప్పజెప్పి గుడ్లప్పగించి చూస్తున్నారని విమర్శించారు.

> మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి కోసం కాంగ్రెస్ రూ.90 కోట్లు ఖర్చు చేసిందని, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఇచ్చామని ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి బట్టబయలు చేసినా ఈడీ, ఐటీ, ఎలక్షన్ కమిషన్ ఎందుకు స్పందించడం లేదు? పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు చేసి కేసు ఎందుకు నమోదు చేయలేదు? బడేభాయ్-చోటేభాయ్ మైత్రి బంధంతోనే కేంద్ర దర్యాప్తు సంస్థలు మౌనం వహిస్తున్నయా? – హరీశ్‌రావు

అమానుల్లాఖాన్‌కు కేటీఆర్ భరోసా

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్‌కు కేటీఆర్ అండగా నిలిచారు. గుండె ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందించాలని వేడుకోగా 'అంతా నేను చూసుకుంటా.. అధైర్య పడకు.. అండగా ఉంటా'నని భరోసా ఇచ్చారు. మంగళవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబుయాదవ్‌తో కలిసి అమానుల్లాఖాన్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. తన అనారోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, గుండె ఆపరేషన్ చేయించుకోవాల్సిన దీన పరిస్థితిని వివరించారు. తక్షణమే స్పందించిన కేటీఆర్ 'అన్నీ నేను చూసుకుంటా. ఆపరేషన్ చేయిస్తా. ధైర్య ంగా ఇంటికెళ్లు' అని అభయమిచ్చారు. తనకు అండగా నిలిచిన కేటీఆర్‌కు అమానుల్లాఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబానికి అండగా కేటీఆర్

- చిన్నారుల వైద్య ఖర్చులు భరించిన మాజీ మంత్రి
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

రామారెడ్డి, ఫిబ్రవరి 25: కూల్‌డ్రింక్ అనుకుని గండిమందు తాగి దవాఖాన పాలైన ఇద్దరు చిన్నారులకు కేటీఆర్ అండగా నిలిచారు. వైద్యానికి అయిన ఖర్చును చెల్లించి పెద్దమనసు చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రామారెడ్డి మండలం స్కూల్‌తండాకు చెందిన గంగావత్ మంత్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు సంజన, బిందు ఉన్నారు. మంత్ పొలానికి కొట్టేందుకని తెచ్చిన మందును థమ్సప్ బాటిల్‌లో నింపిపెట్టాడు. శనివారం స్కూల్ నుంచి వచ్చిన కూతుళ్లు థమ్సప్ బాటిల్‌ను చూసి కూల్‌డ్రింక్‌గా భావించి తాగారు. అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట్ దవాఖానలో చేర్పించగా కోలుకున్నారు. తల్లిదండ్రులు దవాఖాన బిల్లులు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులుపడుతున్న విషయం తెలిసిన కేటీఆర్.. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్యను దవాఖానకు వెళ్లాలని ఆదేశించారు. మంగళవారం దవాఖానకు వెళ్లిన ఆగయ్య పిల్లల వైద్యానికి అయిన ఖర్చును చెల్లించి డిశ్చార్జి చేయించారు. కేటీఆర్, పార్టీ నేతలకు చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

'మల్కపేట' నుంచి నీటిని విడుదల చేయాలి

మంత్రి ఉత్తమ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి.. పంటలకు సాగునీరందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. మధ్యమానేరు నీటిని ఎత్తిపోసి మల్కపేట రిజర్వాయర్ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగసముద్రం చెరువును నింపాలని లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మల్కపేట రిజర్వాయర్ ఎత్తిపోతల ట్రయల్ రన్ పూర్తయ్యిందని, ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం చేయలేకపోయామని వివరించారు. మధ్యమానేరులో 17 టీఎంసీల నీరు ఉన్నందున నీటిని ఎత్తిపోసి సింగసముద్రం చెరువును నింపి రెండువేల ఎకరాలకు సాగునీరందించాలని కోరారు. దీంతో రాచర్లబొప్పాపూర్, గొల్లపల్లి, దేవునిగుట్టతండా, రాచర్ల తిమ్మాపూర్, బాకూర్‌పల్లి తండా, అల్మాస్‌పూర్, అక్కపల్లి, బుగ్గరాజేశ్వర్ తండా, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట, సముద్రలింగాపూర్ గ్రామాలకు చెందిన రైతుల పంటలను కాపాడుకున్న వాళ్లమవుతామని విజ్ఞప్తి చేశారు.

కక్షసాధింపు కేసులను కొట్టేయండి

- కేటీఆర్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ
- ఆత్రం సుగుణ, ఎంపీ అనిల్‌కు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌పై అనుచిత ఆరోపణలు చేశానన్న అభియోగాలతో తనపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుతోపాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి, సైఫాబాద్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కక్ష సాధింపు కేసులను కొట్టేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హైకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపిస్తూ.. కేటీఆర్ ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, అయినప్పటికీ కాంగ్రెస్‌కు చెందిన ఆత్రం సుగుణ, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఈ కేసులు దాఖలు చేశారని వివరించారు. రాజకీయ కక్షసాధింపుతో నమోదైన ఈ కేసులను కొట్టివేయాలని కోరారు. దీంతో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆత్రం సుగుణ, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్‌కు నోటీసులు జారీచేసిన జస్టిస్ విచారణను మార్చి 18కి వాయిదా వేశారు. తీన్మార్ మల్లన్న ఫిర్యాదుతో నమోదైన కేసును కొట్టేయాలన్న పిటిషన్‌పై విచారణను చేపట్టలేనని స్పష్టంచేశారు. ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆ పిటిషన్‌ను మరో ధర్మాసనం ముందుంచాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు.

'బార్' ఎన్నికల వివాదంపై విచారణ 27కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లకు, బార్ కౌన్సిల్‌కు మధ్య నెలకొన్న ఎన్నికల వివాదంపై హైకోర్టులో విచారణ 27కు వాయిదా పడింది. బార్ అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకోకుండా బార్ కౌన్సిల్‌ను నిరోధించాలని, అసోసియేషన్ల కాలపరిమితిని రెండేండ్లు పెంచలేమంటూ కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్, 24 కోర్టుల అసోసియేషన్లు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విజయసేన్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు.

అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు

నీరా కేఫ్ ధ్వంసం నీచమైన చర్య

- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్
- 17న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26: గౌడల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న, సమస్త ప్రజలకు దివ్య ఔషధాన్ని పంచుతున్న నీరా కేఫ్‌ను ధ్వంసం చేయడం నీచమైన చర్య అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఐఐసీటీ లాంటి సంస్థలు, విదేశాలకు చెందిన కొన్ని పరిశోధన సంస్థలు కూడా నీరా ఆరోగ్యకరమైందని తేల్చినట్టు చెప్పారు. నీరాకేఫ్ తొలగింపును గౌడ కులస్తులు, వృత్తిపై కాంగ్రెస్ ప్రభుత్వ దాడిగా పరిగణిస్తున్నామని స్పష్టంచేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మార్చి 17న ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో మహాధర్నా నిర్వహిస్తామని చెప్పారు. అన్ని కుల వృత్తుల నాయకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మహాధర్నాలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతుండగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆయన ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. ఇందులో కుట్ర ఉందని ఆరోపించారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ కన్వీనర్ అయిలి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.



వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు

రైతులను మోసం చేస్తే పుట్టగతులుండవు

- మిర్చి రైతుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎనుమాముల మార్కెట్‌లో మిర్చి రైతులకు భరోసా

వరంగల్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతులను మోసం చేసిన ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీజేపీ అబద్ధాలు చెప్పి కేంద్రంలో, బోగస్ మాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడంలేదని, పంట రుణాలను మాఫీ చేయలేదని, యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లలో పెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం ఎనుమాముల మార్కెట్‌లో రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న మిర్చి రైతుల కష్టాలు విని, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో మిర్చి క్వింటాలుకు రూ.25వేల నుంచి 30 వేలు ధర పలికిందని, ఈసారి ధర సగానికి పడిపోయిందన్నారు. క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేపై వద్దన్నా ముందుకే!

- రూ.4030 కోట్లతో హెచ్ఎండీఏ టెండర్లు
- రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ హైవేగా నామకరణం
- భూములిచ్చేది లేదని రైతులు చెప్పినా నిర్బంధ సర్వే
- అడుగడుగునా అడ్డుకున్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- పోలీసు బందోబస్తు నడుమ సర్వే పూర్తి.. తాజాగా టెండర్లు

హైదరాబాద్ సిటీ బ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట సమీపంలో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవేపై కాంగ్రెస్ సర్కారు మొండిగా ముందుకు పోతున్నది. 'మా ప్రాణాలు పోయినా రోడ్డు వేయనివ్వం.. ఉన్న కొద్ది పాటు భూములను లాక్కుంటే మెమెట్ల బతకాలె' అంటూ రైతులు అడుగడుగునా అడ్డుపడ్డా వారి ఆవేదనను పట్టించుకోకుండా నిర్బంధంగా తన పని తాను చేసుకుపోతున్నది. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి హెచ్ఎండీఏ తాజాగా టెండర్లను ఆహ్వానించింది. రావిర్యాల నుంచి ఫోర్త్ సిటీకి అనుసంధానం చేస్తూ భారీ రహదారి నిర్మాణానికి ప్రణాళికలు వేసింది. దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే రావిర్యాల ఇంటర్ జంక్షన్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు, అక్కడి నుంచి ఆమనగల్ వరకు రూ.4030 కోట్లతో 8 లైన్ల వెడల్పుతో వేయనున్నారు. ఈ నెల 28 నుంచి టెండర్ల ప్రక్రియ మొదలుకానుండగా, మార్చి 21 వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఓఆర్ఆర్, రీజనల్ రింగ్‌రోడ్డును అనుసంధానం చేసే ఈ మార్గానికి రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ హైవేగా హెచ్ఎండీఏ నామకరణం చేసింది.

1900 పైగా బాధిత రైతులు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఒప్పించి 14 వేల ఎకరాలు సేకరించింది. ప్రస్తుతం ఈ భూములు ప్ర